# క్రైమ్ మిర్రర్ ®

Voice of Anti Corruption

15 ANNIVERSARY

హైదరాబాద్
12-5-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 39

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


నగరం నడిబొడ్డున... ఉస్మానియా యూనివర్సిటీకి అతి సమీపంలో సుమారు 1000 కోట్ల భూమి కబ్జాకు గురవడం సంచలనం రేపుతోంది. సుమారు 9 ఎకరాల ఎర్రకుంట చెరువులో రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు పుట్టుకొచ్చాయి. గుర్తు తెలియని కొందరు ఒక్క రోజులోనే 250 వరకు గుడిసెలను ఏర్పాటు చేయడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఈ భూమిపై కోర్టులో కేసులు నడుస్తుండడంతో జీహెచ్ఎంసీ పట్టించుకోకుండా వదిలేసింది. ఈ నేపథ్యంలో నగరం నడిబొడ్డున ఉన్న ఈ భూమిపై ఓ మంత్రి కన్ను పడినట్లు ప్రచారం జరుగుతోంది. తన అనుచరులతో రాత్రికి రాత్రి గుడిసెలు వేయించి కబ్జా చేయించినట్లు చర్చ జరుగుతోంది.



# తార్నాకలో 1000 కోట్ల భూ కబ్జా...

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** నగరం నడిబొడ్డున... ఉస్మానియా యూనివర్సిటీకి అతి సమీపంలో సుమారు 1000 కోట్ల భూమి కబ్జాకు గురవడం సంచలనం రేపుతోంది. సుమారు 9 ఎకరాల ఎర్రకుంట చెరువులో రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు పుట్టుకొచ్చాయి.

మిగతా 2లో

9 ఎకరాల ఎర్రకుంట చెరువు ఆక్రమణ.

రాత్రికి రాత్రే వెలసిన అక్రమ నిర్మాణాలు.

గుడిసెలు వేసిన గుర్తు తెలియని వ్యక్తులు.

కేసులు ఉండడంతో ఖాళీగా వదిలేసిన జీహెచ్ఎంసీ.

కలెక్టర్, ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లిన స్థానికులు.

భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు.

హైడ్రా తో విచారణ చేయిస్తామన్న డిప్యూటీ మేయర్.

ఈ తతంగం వెనుక ఓ మంత్రి హస్తం ఉన్నట్లు ప్రచారం




## అర్హతలో బాలికలు.. ర్యాంకుల్లో బాలురు

ఇంజనీరింగ్‌లో పదికి పది బాలురకే

అగ్రి, ఫార్మసీలో తొలి పదిలో 9 బాలురకు రెండు

మిగతా 2లో

## జుగల్‌బందీ సూపర్ హిట్

వెస్టర్న్ బీట్‌కు సంప్రదాయ నృత్యరీతుల జోడింపు

మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవంలో కొత్త ప్రయోగం

ప్రత్యేకంగా ఆస్వాదించిన మిస్ వరల్డ్ బృందం



## విచ్చలవిడిగా ఔట్ సోర్సింగ్

# ఏజెన్సీల దోపిడీ

ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు సర్కారీ మేత నెలకు 200 కోట్లు.

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య 2 లక్షలు

ప్రభుత్వాలు మారినా... పాలకులు మారినా... ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తలరాతలు మారడం లేదు. గిగ్ వర్కర్లకు బతుకు పై భరోసా ఇస్తామని చెబుతున్న తెలంగాణ ప్రభుత్వం శ్రమ దోపిడీకి గురవుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పై నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రెండు లక్షల మంది ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఉంటే... వారి నుంచి ప్రతి నెలా 200 కోట్ల మేర ఏజెన్సీలు దండుకుంటున్నాయని ఉద్యోగ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ లెక్కల ప్రకారం 1.40 లక్షలు.

అనధికారికంగా మరో 60 వేలు.



- నెలకు ఒక్కో ఉద్యోగిపై కనీస దోపిడీ రూ. 8,525.
- మధ్యస్థంగా రూ. 10,656 వసూలు.
- మూడో క్యాటగిరీలో గరిష్ట దోపిడీ రూ. 12,432.
- దోపిడీ లెక్కల గుట్టు విప్పిన ఉద్యోగ నేతలు.
- సదరు సంస్థల పై చర్యలకు డిమాండ్.
- ఔట్ సోర్సింగ్ కార్పోరేషన్ ఏర్పాటుకు వినతి.

తెలంగాణ బ్యూరో, క్రైమ్ మిర్రర్ : ఈ క్రమంలోనే లక్షల మంది శ్రమజీవుల ఉసురు తీస్తున్న ప్రైవేటు ఏజెన్సీల దారుణాల పై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ ఊపందుకుంటున్నది. ప్రభుత్వం ప్రతి ఏడాదీ రెన్యువల్ పేరుతో ఏజెన్సీలను ఎంపిక చేస్తుంది కానీ నిబంధనల అమలును పర్యవేక్షించడం లేదని ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఫలితంగా సుమారు రెండు లక్షల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు భారంతో బతుకులు వెళ్ళదీస్తున్నారని, ఆర్థికంగా భారీగా నష్టపోతున్నారని ఆ సంఘాల నేతలు చెబుతున్నారు.

గ్రామ స్థాయి నుంచి సచివాలయం వరకు...ప్రభుత్వ కార్యాలయాల్లో శాశ్వత ఉద్యోగ కల్పన నుంచి తప్పించుకున్న గత తెలంగాణ ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ పేరిట తాత్కాలిక ఉద్యోగం పేరుతో లక్షల మందిని నియమించింది. కాగా వీరు కాంట్రాక్టు, గౌరవ వేతనం, ఎన్ఎంఆర్ పేర్లతో వివిధ శాఖల్లో పనిచేస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి తెలంగాణ అంబేద్కర్ సచివాలయం వరకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు.

మిగతా 2లో

# మన సైనిక సత్తా చాటాం

- సిందూరం తుడిచేసిన వారిని శిక్షించాం
- ఆపరేషన్ సిందూర్‌పై రాజ్‌నాథ్
- సరిహద్దుల్లోనే కాదు.. రావల్పిండి వరకు వినిపించాం
- అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించాం: వాయుసేన
- పాక్ అత్యాధునిక యుద్ధ విమానాలను నేలకూల్చాం
- కీలక యుద్ధ స్థావరాలను పేల్చేశాం..రక్షణ శాఖ ప్రకటన
- కశ్మీర్‌పై పరిష్కారానికి పాటుపడతా: ట్రంప్
- సరిహద్దుల్లో ప్రశాంతత.. నేడు డీజీఎంవోల చర్చలు



మిగతా 3లో


## ఈ-కేవైసీ నమోదులో ఏపీ అగ్రస్థానం: మంత్రి నాదెండ్ల మనోహర్

జూన్ నుంచి రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు

మంత్రి నాదెండ్ల మనోహర్

స్మార్ట్ కార్డును చూపుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి: రేషన్ కార్డుల్లోని సభ్యుల ఈ-కేవైసీ నమోదులో దేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో



## వీరుడా.. సెలవిక

శ్రీసత్యసాయి జిల్లా కల్లి తండాలో మురళీ నాయక్‌కు వీడ్కోలు పలుకుతున్న అశేష జన సందోహం

# జుగల్‌బందీ సూపర్ హిట్

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: ప్రపంచ సుందరి పోటీల ప్రారంభోత్సవంలో ఈసారి మిస్ వరల్డ్ లిమిటెడ్ చేసిన కొత్త ప్రయోగం బాగా ఆకట్టుకుంది. వాస్తవానికి తెలంగాణ సాంస్కృతిక శాఖ ఈ ప్రతిపాదన చేసింది. దీనిపై తొలుత కాస్త విముఖత ప్రదర్శించిన మిస్ వరల్డ్ సంస్థ తర్వాత ఆమోదించింది. చివరకది మిస్ వరల్డ్ బృందాన్నే బాగా ఆకట్టుకోవడంతో పాటు అనూహ్య స్పందన లభించింది. ఏ నగరంలో జరిగినా.. మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవంలో స్థానిక సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించటం సహజం.ఇదే తరహాలో హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ప్రారంభోత్సవంలో 250 మంది కళాకారులతో తెలంగాణ సంప్రదాయ పేరిణి నృత్య విన్యాసాన్ని ప్రదర్శించారు. ఇంతవరకు ఎప్పుడూ జరిగే తంతే. సాంస్కృతిక కార్యక్రమాల తర్వాత, మిస్ వరల్డ్ పోటీదారులను వేదిక మీదకు ఆహ్వానించి పరిచయం చేస్తారు. కానీ హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ పరిచయ భాగాన్ని ఒకింత కొత్తగా డిజైన్ చేశారు. పోటీదారులను ఖండాల వారీగా నాలుగు బృందాలుగా విభజించి, ఒక్కో బృందం పరిచయానికి పైలట్ తరహాలో ఒక్కో సంప్రదాయ నృత్యరీతిని ప్రదర్శించేలా రూపకల్పన చేశారు. గుస్సాడీ, ఒగ్గు డోలు, లంబాడీ, కొమ్ము కోయ నృత్య కళాకారులను నాలుగు బృందాలుగా చేసి, ఒక్కో ఖండం పోటీదారులను కళాకారులు తమ విన్యాసాన్ని ప్రదర్శిస్తూ ఆహ్వానించే తరహాలో రూపొందించారు. దీనికి పాశ్చాత్య సంగీతాన్ని కూడా జోడించారు. ఈ కార్యక్రమానికి ప్రపంచ వీక్షకుల నుంచి అభినందనలు వెల్లువెత్తడంతో నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# అర్హతలో బాలికలు.. ర్యాంకుల్లో బాలురు

హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీఈఏపీసెట్)లో బాలికలే పైచేయి సాధించారు. అయితే, టాప్ ర్యాంకుల్లో మాత్రం బాలురే ముందు వరుసలో ఉన్నారు. ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మా విభాగాల్లో టాప్ ర్యాంకులు అత్యధికంగా బాలురకే దక్కాయి. మొత్తంగా ఇంజనీరింగ్ విభాగంలో 73.26 శాతం అర్హత సాధిస్తే, అగ్రి, ఫార్మసీ సెట్‌లో 87.82 శాతం మంది అర్హత సాధించారు. ఈఏపీసెట్ ఫలితాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం 11 గంటలకు తన నివాసంలో విడుదల చేశారు. అర్హత సాధించిన విద్యార్థులకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన, జేఎన్‌టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కిషన్‌రెడ్డి, సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దీన్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

టాపర్లంతా బాలురే

ఈఏపీసెట్ పరీక్షలు ఏప్రిల్ 29 నుంచి మే 4వ తేదీ వరకు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇంజనీరింగ్ సెట్‌కు 2,20,326 మంది దరఖాస్తు చేసుకుంటే, 2,07,190 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో

# తార్నాకలో 1000 కోట్ల భూ కబ్జా...





(మొదటి పేజీ తరువాయి)

గుర్తు తెలియని కొందరు ఒక్క రోజులోనే 250 వరకు గుడిసెలను ఏర్పాటు చేయడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఈ భూమిపై కోర్టులో కేసులు నడుస్తుండడంతో జీహెచ్‌ఎంసీ పట్టించుకోకుండా వదిలేసింది. ఈ నేపథ్యంలో నగరం నడిబొడ్డున ఉన్న ఈ భూమిపై ఓ మంత్రి కన్ను పడినట్లు ప్రచారం జరుగుతోంది. తన అనుచరులతో రాత్రికి రాత్రి గుడిసెలు వేయించి కబ్జా చేయించినట్లు చర్చ జరుగుతోంది. తార్నాక లోని సర్వే నెంబర్ 121,122, 123, 125 లలో 9 ఎకరాలలో ఎర్రకుంట చెరువు స్థలం ఉంది. అయితే శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఈ స్థలాన్ని ఆక్రమించుకుని సుమారు 250 వరకు గుడిసెలు ఏర్పాటు చేశారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ ల పరిధిలో ఉన్న ఈ స్థలంలో వాకింగ్ ట్రాక్, పార్క్ ఏర్పాటు చేయాలని స్థానికులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ స్థలం విషయంలో న్యాయస్థానంలో కేసులు సైతం నడుస్తుండడంతో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అధికారులు పట్టించుకోకుండా ఖాళీగా వదిలేశారు. ఇదే అదనుగా భావించిన కొందరు అర్ధరాత్రి దాటిన తర్వాత సదరు స్థలంలో గుడిసెలు నిర్మించారు. అయితే కబ్జాదారుల వెనుక ఓ మంత్రి హస్తం ఉన్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అయితే స్థానికులు కొందరు భూ కబ్జా విషయాన్ని కలెక్టర్, ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లడంతో... వారి ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## విచారణ చేపట్టనున్న హైడ్రా...

ఎర్రకుంట చెరువు స్థలంలో గుడిసెలు నిర్మించారనే సమాచారం అందుకున్న జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రలతా శోభన్ రెడ్డి చెరువు స్థలం వద్దకు చేరుకుని ఆక్రమణలను పరిశీలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఓయూ పోలీసులు రంగంలోకి దిగి గుడిసెలను తొలగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల కబ్జాల ను అరికట్టేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వ స్థలాలను కాపాడడమే తమ ధ్యేయమన్నారు. ఇలాంటి కబ్జా కార్యక్రమాలను అరికట్టేందుకే ప్రభుత్వం హైడ్రా ను ఏర్పాటుచేసి పటిష్టమైన చర్యలను చేపడుతుందన్నారు. తార్నాక ఎర్రకుంట చెరువు ఘటనపై కూడా హైడ్రా ద్వారా ప్రత్యేక విచారణ చేపట్టనున్నామని డిప్యూటీ మేయర్ తెలిపారు.

# విచ్చలవిడిగా ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

అయితే వీరికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా భిక్షం వేసినట్లుగా అతి తక్కువ జీతాలు ఇచ్చి గంపెడు చాకిరీ చేయించుకుంటున్నారని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ భద్రత అటుంచితే... కనీస వేతనాల్లో న్యాయం చేస్తున్నారా అంటే అదీ లేదు. సమాన పనికి సమాన వేతనం శాశ్వత ఉద్యోగులతో పాటుగా ఇవ్వాలని సుప్రీం కోర్టు 2016 లో తీర్పునిచ్చింది. ఒకేరకమైన పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి అతి తక్కువ వేతనం, ప్రభుత్వ ఉద్యోగికి మాత్రం ఎక్కువ మొత్తంలో జీతాలు చెల్లించడాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది. అయినా గత తెలంగాణ ప్రభుత్వంలో ఇసుమంత కూడా చలనం రాలేదు. ఎంత సేపు వారితో పని చేయించుకోవడం, ప్రైవేటు ఏజెన్సీల ను మేపడం తప్ప మరోటి చేయడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీరి శ్రమను గుర్తించక పోయినా కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం అయినా గుర్తిస్తుందని సంతోషపడినా... తాత్కాలిక ఉద్యోగులకు నిరాశ తప్పడం లేదు. అయితే ఇటీవల ప్రభుత్వం పై ఒత్తిడి పెరగడంతో రిటైర్డ్ ఐఏఎస్ అధికారితో ఒక కమిటీ వేసి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఈ కమిటీలో మొత్తం ముగ్గురు సభ్యులు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు గిగ్ వర్కర్ల భద్రత పేరుతో ఇప్పటికే ప్రభుత్వం రెండు, మూడు సార్లు సమావేశాలు నిర్వహించింది. ప్రభుత్వ వ్యవస్థలో భాగమై పని చేస్తున్న వీరి విషయంలో ప్రభుత్వం న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

## బిస్వాల్ సిఫారసులు బుట్ట దాఖలు...

ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం తో పాటు వారికి పీఆర్సీ కోసం 2020 లో సీఆర్ బిస్వాల్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ అప్పట్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలపై పలు సిఫార్సులు చేసింది. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు, ఎన్ఎంఆర్, తాత్కాలిక ఉద్యోగులకు కనీస వేతనం ( బేసిక్ పే ) రూ. 19 వేలు, ఆ తర్వాత క్యాటగిరీ వారికి రూ. 22,900, రూ. 31,040 చొప్పున ఇవ్వాలని సూచించింది. ప్రతి ఏడాది రూ. ఒక వేయి చొప్పున పెంచాలని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు కూడా మొదటి క్యాటగిరీ కింద కనీస వేతనం రూ. 19 వేలు గా ఖరారు చేసింది. బిస్వాల్ కమిటీ సిఫారసులను, సుప్రీం కోర్టు ఆదేశాలను గత టీఆర్ఎస్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. మొక్కుబడిగా కొంత పెంచి మమ అనిపించిందని ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు చెబుతున్నారు.

**సర్కారు మంజూరు రూ. 22,136, ఏజెన్సీ ఇచ్చేది రూ. 13,611...**

మొదటి క్యాటగిరీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి ప్రతి నెలా తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసే మొత్తం రూ. 22,136. అయితే ప్రైవేటు ఏజెన్సీలు వివిధ రకాల కోతలు విధించి రూ. 13,611 మాత్రమే చెల్లించి, మిగిలిన రూ. 8,525 లను తమ జేబుల్లో చేసుకుంటున్నాయి. రెండో క్యాటగిరీలో రూ. 27,670 ప్రభుత్వం ఇస్తే, సదరు ఏజెన్సీలు ఉద్యోగికి రూ. 17,014 చెల్లించి రూ. 10,656 స్వాహా చేస్తున్నాయి. ఇక మూడో క్యాటగిరీలో రూ. 32,281 ప్రభుత్వం మంజూరు చేస్తే ఉద్యోగికి ఏజెన్సీలు రూ. 19,849 ఇచ్చి మిగిలిన రూ. 12,432 లను నొక్కేస్తున్నాయి. కాగా ఈ మొత్తం ఎలా మిగులుతుందంటే ఈపీఎఫ్, ఈఎస్ఐ, జీఎస్టీ పద్దుల కింద ప్రభుత్వం మంజూరు చేస్తుంది. 25 శాతం ఈపీఎఫ్, 4 శాతం ఈఎస్ఐ, 18 శాతం జీఎస్టీ మొత్తాన్ని సంబంధిత శాఖల్లో ప్రతి నెలా చెల్లించకుండా ఎగవేస్తున్నాయి. ఒక వేళ చెల్లించినా మొక్కుబడిగా ఒకటి రెండు నెలలు చెల్లించి, ఆ తర్వాత చెల్లించడం లేదు. ఇది పోను ప్రభుత్వం ప్రాంతాల వారీగా నాలుగు నుంచి ఆరు శాతం వరకు ఏజెన్సీలకు కమీషన్లు అధికారికంగా ఇస్తుంది. అయితే మొదటి క్యాటగిరీ కింద రూ. 8,525, రెండో క్యాటగిరీలో రూ. 10,656, మూడో క్యాటగిరీలో రూ. 12,432 చొప్పున ప్రతి ఉద్యోగి నుంచి ప్రైవేటు ఏజెన్సీలు స్వాహా చేస్తున్నా ప్రభుత్వ అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. ఈ దందా కొన్ని సంవత్సరాల నుంచి నిరాటంకంగా కొనసాగుతోంది. ఇందులో సెక్షన్ అధికారి మొదలు డబ్బులు ఇచ్చే ట్రెజరీ అధికారి వరకు అందరికీ వాటాలు ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏజెన్సీ అధికారిక కమీషన్ల శాతం రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధంగా లేదు. ఒక చోట నాలుగు, మరో చోట రెండు శాతం చొప్పున ఇష్టారీతిన అమలు చేస్తున్నారు. కాంట్రాక్టు అగ్రిమెంట్ కాలం ఏడాది కాలం మాత్రమే కావడంతో ఆడిందే ఆట పాడిందే పాటగా ఈ దందా సాగుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఒక వేళ మరుసటి సంవత్సరం ఏదైనా ఏజెన్సీకి కాంట్రాక్టు దక్కనట్లయితే ప్రభుత్వానికి ఏ లెక్క కూడా అప్పచెప్పరని, రికార్డులు కూడా సమర్పించే సమస్యే లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చే అన్ని రకాల మొత్తాలు ఏజెన్సీ జేబుల్లోకి వెళ్లి పోతాయని ఉద్యోగులు చెబుతున్నారు.

# వీరుడా.. సెలవిక

## శ్రీసత్యసాయి జిల్లా కల్లి తండాలో మురళీ నాయక్‌కు వీడ్కోలు పలుకుతున్న అశేష జన సందోహం

పుట్టపర్తి: కశ్మీర్‌లో విధి నిర్వహణలో ఉండగా పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో మరణించిన అగ్నివీర్ ముదావత్ మురళి నాయక్ అంత్యక్రియలు ఆదివారం ప్రభుత్వ లాంఛనాల మధ్య పూర్తయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లా గోరుంట్ల మండలం కల్లి తండాలో మురళి నాయక్ భౌతికకాయాన్ని చూసేందుకు ప్రజలు పోటెత్తారు. శనివారం రాత్రి భౌతికకాయం స్వగ్రామానికి చేరుకోగా.. అప్పటి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు తండోపతండాలుగా జనం తరలివచ్చి వీర జవాన్‌కు అశ్రు నివాళులర్పించారు. జోహార్ మురళి నాయక్.. మురళి నాయుక్ అమర్ రహే.. జై జవాన్.. భారత్ మాతాకీ జై.. జై హింద్.. వీరుడా ఇక సెలవు.. అంటూ నినదించారు. తమ ఊరి యువకుడు దేశం కోసం ప్రాణాలర్పించడం ఓవైపు గర్వంగా ఉన్నప్పటికీ.. మరో వైపు తీవ్ర బాధతో ఉన్నామని గ్రామస్తులందరూ భావోద్వేగానికి గురయ్యారు. మురళి నాయక్ కుటుంబ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పర్యవేక్షణలో కల్లి తండాలో ఏర్పాట్లు జరిగాయి. కాగా, అగ్నివీర్ మురళి నాయక్ భౌతిక కాయం వద్ద ఘనంగా సైనిక వందనంతో నివాళులర్మించిన అనంతరం అంత్యక్రియలు పూర్తి చేశారు. అంత్యక్రియల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అనిత, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, సవిత, పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అంతకుముందు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమున్వయకర్తలు ఈర లక్కప్ప, దీపిక, మక్బుల్ తదితరులు మురళి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎస్పీ వి.రత్న నేతృత్వంలో కల్లి తండాలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరజవాన్ మురళినాయక్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.50 లక్షల ఆర్థిక సాయం, 5 ఎకరాల భూమి, 300 గజాల్లో ఇంటి నిర్మాణం, తండ్రి శ్రీరామ్ నాయక్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకుటించారు. తన వంతు సాయంగా మరో రూ.25 లక్షలు ఇస్తానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. అయితే 'ఆస్తులు ఇచ్చినా.. ఇల్లు కట్టించినా.. అనుభవించేందుకు, ఆనందించేందుకు మా బిడ్డ లేకపాయె కద సారూ.. నా బిడ్డ దేశం కోసం ప్రాణాలొదిలాడని గర్వంగా అందరూ చెబుతున్నా.. కన్నపేగు బాధ ఎమురికి తెలుసయ్యా' అంటూ మురళినాయక్ తల్లిదండ్రులు గుండెలు బాదుకుని విలపించారు. తామిక ఎవరి కోసం బతకాలంటూ కన్నీరు మున్నీరయ్యారు.




# ఈ-కేవైసీ నమోదులో ఏపీ అగ్రస్థానం: మంత్రి నాదెండ్ల మనోహర్



(మొదటి పేజీ తరువాయి)

ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 95% ఈ-కేవైసీ పూర్తయినట్లు వెల్లడించారు. తెనాలిలో ఆదివారం మంత్రి విలేకర్లతో మాట్లాడారు. 'రాష్ట్రంలో 1,46,21,223 బియ్యం కార్డులు, 4,24,59,028 మంది సభ్యులు ఉన్నారు. ఈ నెల 8 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో బియ్యం కార్డుల్లో మార్పులు, చేర్పులు, నూతన కార్డులకు దరఖాస్తుల స్వీకరణ వంటి 6 రకాల సేవలు అందించే ప్రక్రియ మొదలైంది. ఈ నెల 15 నుంచి వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ఇంటి నుంచే ఈ సేవలు పొందే సౌకర్యం అందుబాటులోకి తీసుకురానున్నాం. ప్రజలు 95523 00009 నంబరుకు 'హలో' అన్న సందేశం పంపడం ద్వారా ఈ సేవలను పొందవచ్చు. జూన్ నుంచి రేషన్ కార్డుల స్థానంలో ఆధునిక స్మార్ట్ కార్డులను అందించే ప్రక్రియ ప్రారంభిస్తాం. తొలిసారిగా ఒంటరి వారికీ కార్డు ఇవ్వనున్నాం. కళాకారులుగా పింఛను అందుకుంటున్న వారికి, గిరిజన బృందాలకు ప్రత్యేకంగా అంత్యోదయ కార్డుల ద్వారా నెలకు 35 కిలోల బియ్యం అందిస్తాం. లింగ మార్పిడి జరిగిన వారికీ కార్డులు ఇస్తాం' అని మంత్రి వివరించారు.

## ఇదేమైనా ఘనకార్యమా.. పిచ్చి వేషాలు ఆపండి: సజ్జనార్

హైదరాబాద్: సోషల్ మీడియాలో ఫేమస్ అయ్యేందుకు కొందరు పిచ్చి వేషాలు వేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకున్న ఘటనలు చాలానే చూశాం. తాజాగా ఇలాంటి వీడియోను టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ షేర్ చేస్తూ సోషల్ మీడియాలో వ్యూస్, లైక్స్ కోసం విలువైన ప్రాణాలను పణంగా పెట్టాలా!? అని ప్రశ్నించారు. సజ్జనార్ ట్విట్టర్ వేదికగా.. 'ఫేమస్ కోసం ఇలా ప్రాణాలతో చెలగాటం ఆడటం పిచ్చితనం!. సోషల్ మీడియాలో వ్యూస్, లైక్స్ కోసం విలువైన ప్రాణాలను పణంగా పెట్టాలా!?. ఏదో ఘనకార్యం వెలగబెట్టినట్లు ఆ పట్టరాని సంతోషం ఎందుకు.. ఇలాంటివి మీకు సరదాగా అనిపించొచ్చు.. కానీ జరగరాని ప్రమాదం జరిగితే ఏమవుతుందో ఆలోచించండి' అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇక, ఈ వీడియోలో ఒక యువకుడు రైలు పట్టాలపై పడుకుని ఓవరాక్షన్ చేశాడు. రైలు వస్తున్న సమయంలో పట్టాలపై పడుకుని.. రైలు వెళ్లేంత వరకు అలాగే ఉన్నాడు. అనంతరం, పైకి లేచి ఏదో సాధించిన వ్యక్తిలాగా కేకలు వేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఫేమస్ కోసం ఇలా ప్రాణాలతో చెలగాటం ఆడటం పిచ్చితనం!సోషల్ మీడియాలో వ్యూస్, లైక్స్ కోసం విలువైన ప్రాణాలను పణంగా పెట్టాలా!? ఘనకార్యం వెలగబెట్టినట్లు ఆ పట్టరాని సంతోషం ఎందుకు.. ఇలాంటివి మీకు సరదాగా అనిపించొచ్చు.. కానీ జరగరాని ప్రమాదం జరిగితే ఏమవుతుందో ఆలోచించండి.



## మన సైనిక సత్తా చాటాం

(మొదటి పేజీ తరువాయి)

దిల్లీ: ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం తన పరాక్రమాన్ని ప్రదర్శించిందని, పాక్ సైనిక ప్రధాన కార్యాలయం ఉన్న రావల్పిండిలోనూ గర్జించిందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి ద్వారా అనేక కుటుంబాల సిందూరాన్ని తుడిచేసినవారిని సైన్యం తగిన రీతిలో శిక్షించిందని చెప్పారు. ఇది కేవలం సైనిక చర్యే కాదని, ఉగ్రవాదంపై పోరులో భారత రాజకీయ, సామాజిక, వ్యూహాత్మక సంకల్పానికి నిదర్శనమని చెప్పారు. ఉగ్రవాదులతోపాటు భారత వ్యతిరేక శక్తులపై మన సైన్యం ప్రతీకారం తీర్చుకుందన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో సూపర్‌సోనిక్ బ్రహ్మోస్ ఉత్పత్తి, పరీక్షా కేంద్రాన్ని ఆదివారం ఆయన దిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించి ప్రసంగించారు. మరోవైపు సైనికాధికారులు, వైమానిక దళాధికారులు విలేకరులతో మాట్లాడుతూ– పోరులో పాక్‌ను చావుదెబ్బ కొట్టామని, భారీనష్టం కలిగించామని ప్రకటించారు. సరిహద్దుల్లో శాంతి నెలకొనడం ఆదివారం పెద్ద ఊరట.

**పాక్ స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నాం**

"ఉగ్రశక్తులకు భారత్ దీటుగా బదులిస్తుంది. ఉగ్రవాదంపై పోరులో మనకున్న దృఢ సంకల్పంతోపాటు మన సైనిక శక్తిసామర్థ్యాలను ఈ ఆపరేషన్ చాటిచెప్పింది. పహల్గాం బాధితులకు న్యాయం చేకూరింది. పాక్ ప్రజలపై భారత్ దాడి చేయలేదు. అక్కడి ఉగ్ర స్థావరాలను నాశనం చేయడమే ధ్యేయంగా ఆపరేషన్‌ను చేపట్టాం. దాయాది మాత్రం భారత పౌరులే లక్ష్యంగా మన దేశంపై దాడులు చేసింది. పౌర ప్రాంతాలు, ఆలయాలు సహా మతపరమైన ప్రదేశాలపైనా దాడులకు ప్రయత్నించింది. మన సైన్యం శౌర్య పరాక్రమాలను ప్రదర్శించడమే కాకుండా సంయమనాన్ని పాటించింది. భారత్‌లో ఉగ్రచర్యలకు పాల్పడితే పర్యవసానాలు ఎలా ఉంటాయనేది ప్రపంచమంతా చూసింది. ఇది సరికొత్త భారతదేశమని, ఉగ్రవాద వ్యతిరేక చర్యలకు దీటైన జవాబును సరిహద్దుకు రెండువైపులా ఇస్తామని ప్రధాని మోదీ స్పష్టంచేశారు" అని రాజ్‌నాథ్ చెప్పారు. ఉగ్రవాదంపై మనం చర్యలు తీసుకునేటప్పుడు ఉగ్రవాదులు, వారి పోషకులు దేశం అవతల ఉన్నా కూడా వారికి రక్షణ ఉండదని రుజువు చేశామని చెప్పారు. బ్రహ్మోస్ కేవలం ఆయుధం మాత్రమే కాదని.. అది సైనిక దళాల బలాన్ని, దేశ సరిహద్దుల్ని కాపాడుకునే సంకల్పాన్ని చాటే సందేశమని చెప్పారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌లో బ్రహ్మోస్ క్షిపణులను భారత్ ఉపయోగించిందని వెల్లడించారు. ఈ క్షిపణులకున్న శక్తి ప్రపంచ దేశాలకు తెలిసిందన్నారు.

**కశ్మీర్‌పై కలిసి పనిచేద్దాం: అమెరికా**

భారత్–పాకిస్థాన్ దేశాలతో కలిసి కశ్మీర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. సంఘర్షణతో మరణాలు, విధ్వంసం తప్ప ఏమీ ఉండదనేది రెండు దేశాల నాయకత్వాలు అర్థం చేసుకున్నందుకు గర్వంగా ఉందని 'ట్రూత్ సోషల్' మాధ్యమంలో ఆయన వ్యాఖ్యానించారు. 'ఘర్షణలు ఇంకా కొనసాగి ఉంటే లక్షలమంది అమాయక ప్రజలు చనిపోవచ్చు. కాల్పుల విరమణపై చరిత్రాత్మక నిర్ణయం తీసుకోవడానికి అమెరికా సాయం చేసినందుకు నాకు గర్వంగా ఉంది.

# రేవంత్ రెడ్డి ఒక సైకో, శాడిస్ట్ అంటూ ఈటల ఫైర్...

### ఘాటుగా కౌంటర్ ఇచ్చిన జగ్గారెడ్డి

### ఈటలపై జగ్గారెడ్డి ఫైర్: బట్టలిప్పి గుంజీలు తీయిస్తా అంటూ వార్నింగ్

### రేవంత్‌ను విమర్శిస్తే ఊరుకోబోమని హెచ్చరిక

### ఈటలవి నల్లికుట్ల రాజకీయాలు అంటూ విమర్శలు

హైదరాబాద్ శివారు బాచుపల్లిలోని పూజిత అపార్ట్‌మెంట్‌కు హైకోర్టు ఆదేశాల మేరకు అధికారులు కూల్చివేత నోటీసులు జారీ చేసిన ఘటన తీవ్ర రాజకీయ దుమారానికి దారి తీసింది. ఈ విషయం తెలుసుకున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ నిన్న హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక పెద్ద శాడిస్ట్, సైకో. ప్రజలను ఇబ్బందులకు గురిచేయడంలోనే ఆయన ఆనందం పొందుతున్నారు. రాష్ట్రంలో తుగ్లక్ ప్రభుత్వం నడుస్తోంది. ప్రజల జోలికి వస్తే ఖబడ్దార్," అంటూ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయి వాస్తవాలను సీఎం గమనించడం లేదని, తన చుట్టూ ఏం జరుగుతుందో కూడా ఆయనకు తెలియడం లేదని దుయ్యబట్టారు. "ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని వ్యవస్థను సరిదిద్దుకోవాలి. ప్రజల జీవితాలతో చెలగాటమాడేవారు ఎవరూ బాగుపడరు" అని హితవు పలికారు.

ఈ ఈటల పాగల్ గాడు అయ్యిండు: జగ్గారెడ్డి

సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మరోసారి ఇటువంటి 'లూజ్ కామెంట్స్' చేస్తే సహించేది లేదని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఈ ఈటల పాగల్ గాడు అయ్యిండు... అన్నీ బేకూఫ్ చేష్టలు చేస్తున్నాడు అంటూ మండిపడ్డారు. ఆదివారం నాడు గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తన నల్లికుట్ల రాజకీయాలు మానుకోవాలి. హద్దులు మీరి నువ్వు మాట్లాడావు, అందుకే నేను కూడా హద్దులు దాటి సమాధానం చెప్పాల్సి వస్తోంది. అసలు, ఈటలను తిట్టడానికే ఈ ప్రెస్ మీట్ పెట్టాను" అని జగ్గారెడ్డి పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజల సమస్యల గురించి ఈటల ఏనాడూ మాట్లాడలేదని, కేవలం రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆయన ఆరోపించారు. బీజేపీలో ఆశించిన పదవులు దక్కకపోవడంతో ఈటల రాజేందర్ తీవ్ర నిరాశ, నిస్పృహలతో ఉన్నారని జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. "గంజాయి తాగిన వ్యక్తిలా, ఒక సైకోలా ఈటల ప్రవర్తిస్తున్నాడు. పదవి రాలేదన్న ఫ్రస్టేషన్‌లోనే ఆయన ఇలా మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. బూతులు మాట్లాడే వారికి బూతులతోనే సమాధానం చెప్పాల్సి వస్తుందని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దయతలచి ఈటల వ్యాఖ్యలను పట్టించుకోకుండా వదిలేస్తున్నారేమో కానీ, తాము మాత్రం అలాంటి వ్యాఖ్యలను ఉపేక్షించేది లేదని జగ్గారెడ్డి హెచ్చరించారు. "మళ్ళీ ఇంకోసారి ముఖ్యమంత్రి గురించి గానీ, కాంగ్రెస్ పార్టీ గురించి గానీ తగని రీతిలో మాట్లాడితే నడిరోడ్డు మీద బట్టలు విప్పి గుంజీలు తీయిస్తాం" అంటూ తీవ్ర పదజాలంతో జగ్గారెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. ఈటల తన పరిమితుల్లో ఉండి మాట్లాడటం నేర్చుకోవాలని సూచించారు.





## మిస్ వరల్డ్ పోటీలకు వ్యతిరేకంగా మహిళల ధర్నా


### గచ్చిబౌలి స్టేడియం లోపలికి వెళ్లేందుకు యత్నం

### వివిధ మహిళా సంఘాల నేతలు అరెస్ట్

హైదరాబాద్: పాశ్చాత్య సంస్కృతి అయిన మిస్ వరల్డ్ పోటీలను నిరసిస్తూ వివిధ మహిళా సంఘాల నేతలు గచ్చిబౌలి స్టేడియం వద్ద శనివారం సాయంత్రం మెరుపు ధర్నా నిర్వహించారు. మిస్ వరల్డ్ వేడుకల ప్రారంభోత్సవం సమయంలో భారీ బందోబస్తు ఉన్నా పోలీసుల కళ్లు గప్పి స్టేడియం ప్రధాన ద్వారం సమీపంలోని ప్రధాన రహదారి వద్దకు చేరుకోవడం గమనార్హం. గచ్చిబౌలి స్టేడియం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా రోప్‌తో పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం వారిని వాహనంలో మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. యుద్ధ మేఘాలు కమ్ముకున్న ఉద్విగ్న భరిమైన పరిస్థితుల్లో అందాల పోటీలను నిర్వహించడమేంటని వారు ప్రశ్నించారు. రాష్ట్ర ఖజానా దివాళా తీసిందని చెబుతూనే రూ.200 కోట్లు ఖర్చుపెట్టి మిస్ వరల్డ్ పోటీలు ఎందుకు



నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. నిరసన కార్యక్రమంలో పీఓడబ్ల్యూ నేతలు వి.సంధ్య, ఝాన్సీ, అనురాధ, ఐఎఫ్‌టీయూ అరుణ, మహేష్, నాగరాజు, వివిధ మహిళా సంఘాల నేతలు ఎడ్ల జయ, రాణి, జయసుధ, సావిత్రి, సవిత, శ్రీఏదేవితోపాటు సింహాద్రి, రవి పాల్గొన్నారు.



## ప్రాణం తీసిన కూలర్.. నిద్రలోనే తల్లీకూతుళ్లు మృతి

### కామారెడ్డి జిల్లా గుల్లా తండాలో విషాదం

### షార్ట్ సర్క్యూట్ కారణంగా కరెంట్ షాక్

### దూరంగా పడుకోవడంతో బతికిబయటపడ్డ కొడుకు

కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో శనివారం విషాదకర సంఘటన చోటుచేసుకుంది. రాత్రి వేళ చల్లగాలి కోసం పెట్టుకున్న కూలర్ ఇద్దరి ప్రాణాలను బలిగొంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా కూలర్ బాడీకి కరెంట్ పాసవడంతో కూలర్ పక్కనే నిద్రిస్తున్న బాలికకు షాక్ తగిలింది. బాలిక పక్కనే పడుకున్న తల్లి కూడా షాక్ కు గురయింది. షాక్ తీవ్రతకు తల్లీకూతుళ్లు ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. జుక్కల్ మండలంలోని గుల్లా తండాలో ఈ దారుణం చోటుచేసుకుంది. జుక్కల్ పోలీసులు, గుల్లా తండా వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన ప్రహ్లాద్, శాంకబాయి దంపతులకు ఒక కొడుకు, ఇద్దరు కూమార్తెలు ఉన్నారు. పెద్ద కూతురు హైదరాబాద్ లో మిగతా పిల్లలు తండాలోనే చదువుకుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ప్రహ్లాద్ హైదరాబాద్ కు వెళ్లగా ఇద్దరు పిల్లలతో శాంకబాయి ఇంట్లోనే ఉంది. రాత్రి భోజనం తర్వాత కూలర్ ఆన్ చేసి అందరూ నిద్రపోయారు. కూలర్ పక్కనే పడుకున్న శాంకబాయి చిన్న కూతురు శ్రీవాణి నిద్రలో కదలడంతో కాలు కూలర్ కు తగిలింది. దీంతో శ్రీవాణికి షాక్ తగిలింది. శ్రీవాణి పక్కనే పడుకున్న శాంకబాయికి కూడా షాక్ తగిలి ఇద్దరూ చనిపోయారు. కాస్త దూరంగా పడుకున్న శాంకబాయి కుమారుడు ఉదయం నిద్ర లేచి చూసేసరికి తల్లి, చెల్లి ఇద్దరూ విగతజీవులుగా పడి ఉన్నారు. చుట్టుపక్కల వారికి విషయం చెప్పడంతో వారు వచ్చి చూడగా అప్పటికే శాంకబాయి, శ్రీవాణి చనిపోయారు. తండావాసుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

## ఈటల మర్యాదస్తుడు అనుకున్నాం... కానీ మతి తప్పినట్టుంది: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### సీఎం రేవంత్‌పై ఈటల వ్యాఖ్యల పట్ల ఆది శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం

### ఈటల మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని విమర్శ

### బీజేపీ అధ్యక్ష పదవి కోసం సీఎంను దూషిస్తున్నారని ఆరోపణ

### అనుచిత భాష వాడితే సహించేది లేదని హెచ్చరిక



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ఈటలను తాను ఒక మర్యాదస్తుడిగా భావించేవాడినని, కానీ ఆయన ఇటీవలి మాటలు చూస్తుంటే, మతి తప్పినట్లుగా ఉందని ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, "బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కావాలనుకుంటే మీ పార్టీ అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకోవాలి తప్ప, మా ముఖ్యమంత్రిని అసభ్య పదజాలంతో దూషిస్తే పదవి వస్తుందనుకోవడం మీ అవివేకానికి నిదర్శనం. ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో మీరు ఈ స్థాయికి దిగజారతారని మేము ఊహించలేదు. దయచేసి మీ పిచ్చి వాగుడు, ప్రేలాపనలు ఆపండి" అని హితవు పలికారు. ముఖ్యమంత్రిని 'శాడిస్ట్, సైకో' వంటి పదాలతో దూషించడంపై స్పందిస్తూ, "మాకు కూడా అంతకుమించిన భాషలో సమాధానం చెప్పడం వచ్చు, అది గుర్తుంచుకోండి.

## దీపిక, పార్థ్‌కు కాంస్యాలు

**ఆర్చరీ ప్రపంచకప్**

షాంఘై (చైనా): ఆర్చరీ ప్రపంచకప్‌లో భాగంగా శనివారం ఒకేరోజు ఏకంగా ఐదు పతకాలతో దుమ్మురేపిన కాంపౌండ్ ఆర్చర్లు ఇచ్చిన స్ఫూర్తితో రికర్వ్ ఆర్చర్లూ సత్తాచాటారు. ఆదివారం జరిగిన రికర్వ్ వ్యక్తిగత విభాగాల్లో భారత సీనియర్ ఆర్చర్ దీపికా కుమారితో పాటు పురుషుల సింగిల్స్‌లో పార్థ్ సుశాంత్ కాంస్యాలతో మెరిశారు. ఈ ఇద్దరూ ఆదివారం ముగిసిన రికర్వ్ సెమీస్ మ్యాచ్‌లలో ఓడినప్పటికీ కాంస్య పోరులో మాత్రం పుంజుకుని పతకాలు ఖాతాలో వేసుకున్నారు. మహిళల రికర్వ్ సెమీస్‌లో దీపిక.. 1-7తో లిమ్ సిహ్యోన్ చేతిలో ఓడినప్పటికీ.. కాంస్య పోరులో 7-3తో కొరియాకే చెందిన కంగ్ చె యంగ్‌ను ఓడించింది. తొలి సెట్‌లో ఇరువురు ఆర్చర్లు 27 పాయింట్లతో స్కోరు సమం అయినా రెండో సెట్ నుంచి దీపిక పుంజుకుంది. ఒత్తిడిలోనూ గురితప్పని లక్ష్యంతో బాణాలను సంధించి పతకాన్ని ఖాయం చేసుకుంది. ఇక పురుషుల విభాగంలో పార్థ్.. సెమీస్‌లో పరాభవం పాలైనా కీలకమైన కాంస్య పోరులో మాత్రం గురి తప్పలేదు. పార్థ్ 6-4తో బాప్టిస్టె అడిస్ (ఫ్రాన్స్)ను ఓడించి ప్రపంచకప్‌లో తొలి పతకాన్ని ఖాతాలో వేసుకున్నాడు. ఈ టోర్నీని భారత్ మొత్తం ఏడు పతకాలతో ముగించింది.





## శ్రీలంక ఆలౌట్.. ముక్కోణపు సిరీస్ టీమిండియా కైవసం

వన్డే వరల్డ్ కప్ ముందు భారత మహిళల జట్టు అద్భుత విజయం సాధించింది. ముక్కోణపు సిరీస్ ఫైనల్లో శ్రీలంకను చిత్తుగా ఓడించింది. ఆదివారం జరిగిన టైటిల్ పోరులో స్మృతి మంధాన (116) సూపర్ సెంచరీతో భారీ స్కోర్ చేసిన టీమిండియా.. అనంతరం ప్రత్యర్థిని 245 పరుగులకే ఆలౌట్ చేసింది. దాంతో, 97 పరుగులతో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన జయభేరి మోగించింది. తద్వారా నిరుడు ఆసియా కప్ ఫైనల్లో ఎదురైన ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ముక్కోణపు సిరీస్‌లో లీగ్ దశ నుంచి అదరగొట్టిన టీమిండియా ఫైనల్లో పంజా విసిరింది. బలమైన శ్రీలంకను చిత్తు చిత్తుగా ఓడించి ఆసియా కప్ ఓటమికి బదులు తీర్చుకుంది. ప్రేమదాస స్టేడియంలో ఓపెనర్ స్మృతి మంధాన(116) రికార్డు సెంచరీతో విరుచుకు పడగా.. బౌలర్లు లంక బ్యాటర్లకు దడ పుట్టించారు. అమన్‌జీత్ కౌర్ (3-54) నిప్పులు చెరగగా.. మిడిల్ ఓవర్లలో స్నేహ్ రానా(4-38) వికెట్ల వేట కొనసాగించింది. దాంతో, ఆతిథ్య లం 245 పరుగులకే ఆలౌటయ్యింది. విధ్వంసక సెంచరీతో జట్టు విజయంలో భాగమైన మంధాన 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికైంది. ఈ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన స్నేహ్ రానా 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును స్వీకరించింది. లీగ్ దశలో శ్రీలంకను ఓడించి.. ఆ తర్వాతి పోరులో ఓడిన భారత్ ఫైనల్లో ఛాంపియన్ ఆటతో రెచ్చిపోయింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్లు ప్రతీకా రావల్(30), స్మృతి మంధాన(116 101 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లు) శుభారంభం ఇచ్చారు. ఆ తర్వాత హర్లీన్ డయోల్(47), జెమీమా రోడ్రిగ్స్(44) కెప్టెన్ హర్మన్‌ప్రీత్(41)లు లంక బౌలర్లను ఉతికేశారు. మిడిలార్డర్ మెరుపులతో ప్రత్యర్థికి 343 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది భారత్. ఛేదనలో అమన్‌జోత్ కౌర్ చెలరేగడంతో శ్రీలంక టాపార్డర్ విఫలమైంది.

**మలుపు తిప్పిన రానా**

లంక ఓపెనర్ హాసినీ పెరీరా(0)ను డకౌట్ చేసిన అమన్‌జోత్.. ఆ తర్వాత డేంజరస్ విష్మీ గుణరత్నేను బౌల్డ్ చేసింది. ఓపెనర్ల వైఫల్యంతో కష్టాల్లో పడిన జట్టును కెప్టెన్ చమరి ఆటపట్టు(51), నీలాక్షి డిసిల్వా(48) ఆదుకున్నారు. వీళ్లిదరూ 50 ప్లస్ భాగస్వామ్యంతో భారత బౌలర్లను విసిగించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని స్నేహ్ రానా విడదీసింది.



# 16న పున:ప్రారంభం!

## నేడు షెడ్యూల్ వెలువడే అవకాశం .. ఫైనల్ వేదిక మార్పు?



ఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలతో వారం రోజుల పాటు వాయిదాపడిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)ను పున:ప్రారంభించాలనే సంకల్పంతో ఉన్న భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ).. ఈనెల 16 నుంచి లీగ్‌ను తిరిగి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నది. దాయాది దేశాలు కాల్పుల విరమణ ఒప్పందం ప్రకటించిన తర్వాత తాజా సీజన్‌ను వీలైనంత త్వరగా పూర్తిచేయాలనే పట్టుదలతో ఉన్న బీసీసీఐ.. ఈ మేరకు ఆదివారం ఢిల్లీలో ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులతో సమావేశమైంది. బోర్డు వర్గాల సమాచారం ప్రకారం ఈనెల 16 లేదా 17న లీగ్‌ను తిరిగి ఆరంభించాలని యోచిస్తున్నది. మే 9న లక్నో-బెంగళూరు మ్యాచ్‌కు ముందు వాయిదాపడ్డ ఐపీఎల్-18ను మళ్లీ అదే మ్యాచ్‌తో మొదలుపెట్టనున్నట్టు తెలుస్తున్నది. అలాగే ఫైనల్ వేదికను ఈడెన్ గార్డెన్స్ (కోల్‌కతా) నుంచి అహ్మదాబాద్‌కు మార్చనున్నట్టు సమాచారం. ఎట్టిపరిస్థితుల్లోనూ మే 30 లేదా జూన్ 1 నాటికి ఈ సీజన్‌ను పూర్తిచేయాలని బీసీసీఐ భావిస్తున్నట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. కొత్త షెడ్యూల్, వేదికలకు సంబంధించిన వివరాలను సోమవారం ప్రకటించే అవకాశముంది. ఆదివారం సమావేశం ముగిసిన తర్వాత బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా మాట్లాడుతూ.. 'బీసీసీఐ సెక్రటరీ, ఐపీఎల్ చైర్మన్ ఫ్రాంచైజీలతో మాట్లాడుతున్నారు. ఐపీఎల్ పునరుద్ధరణకు సంబంధించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం' అని అన్నారు. లీగ్ వాయిదాతో పలువురు విదేశీ ఆటగాళ్లు తమ స్వస్థలాలకు పయనమైన నేపథ్యంలో ఫ్రాంచైజీలన్నీ వారిని ఒప్పించి మంగళవారం (మే 13) నాటికి వారి హోంగ్రౌండ్‌కు వచ్చేలా చూసుకోవాలని ఆయా జట్లకు బీసీసీఐ సూచించినట్టు బోర్డు ప్రతినిధి ఒకరు తెలిపారు. వేదికలకు సంబంధించి.. ప్లేఆఫ్స్ షెడ్యూల్‌లో ఫైనల్ మ్యాచ్‌కు మినహా హైదరాబాద్‌లో జరగాల్సిన క్వాలిఫయర్, ఎలిమినేటర్ యథావిధిగా జరుగనుంది. ఒకవేళ మే 30 లేదా జూన్ 1న ఫైనల్‌ను నిర్వహిస్తే అదే సమయానికి కోల్‌కతాలో వర్షం పడే అవకాశాలు మెండుగా ఉన్న నేపథ్యంలో తుదిపోరును అహ్మదాబాద్‌లో ఆడించనున్నట్టు సమాచారం.

## పాంటింగ్ చివరి నిమిషంలో..



ఢిల్లీ: సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం, ఐపీఎల్ వాయిదా తర్వాత ఆయా జట్లలో విదేశీ ఆటగాళ్లు, కోచ్‌లు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు మొగ్గు చూపగా పంజాబ్ కింగ్స్ హెడ్‌కోచ్ రికీ పాంటింగ్ మాత్రం.. ఫ్లైట్ ఎక్కినా చివరి నిమిషంలో మనసు మార్చుకున్నాడు. పాంటింగ్ విమానంలో ఉండగానే భారత్, పాక్ కాల్పుల విరమణ ప్రకటన చేయడంతో ఈ ఆసీస్ దిగ్గజం అప్పటికప్పుడు తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. తాను దిగిపోవడమే గాక ఆస్ట్రేలియాకు చెందిన స్టోయినిస్, హార్డీ, ఇంగ్లిస్, బార్ట్‌లెట్‌నూ స్వదేశానికి వెళ్లకుండా ఆపాడని.. వారికి భరోసానిచ్చి భారత్‌లోనే ఉండేవిధంగా ఒప్పించాడని కింగ్స్ సీఈవో సతీశ్ మీనన్ తెలిపాడు.

## నీరజ్‌తో మరో ముగ్గురు..



దోహా(ఖతార్): మరో నాలుగు రోజు ల్లో దోహా వేదికగా జరుగబోయే డైమండ్ లీగ్ పోటీలలో భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాతో పాటు మరో ముగ్గురు అథ్లెట్లు పాల్గొననున్నా రు. పురుషుల జావెలిన్ త్రోలో నీరజ్, కిషో ర్ జెన బరిలోకి దిగనుండగా.. పురుషుల 5000 మీటర్ల రేసులో గుల్వీర్ సింగ్, మహిళల 3 వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్‌లో పారుల్ చౌదరి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

GHMC
hmda Growing Global
TS-bPASS

MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption





ఒకప్పుడు కాలర్ అనేది అమెరికన్ డాలర్ కంటే విలువైంది. దానిపై సర్వహక్కులూ మగవాడికే ఉండేవి. కాలర్ ఎగరేస్తూ జెండా ఎగరేసినంత గొప్పగా ఫీల్ అయ్యేవాడు. ఇప్పుడు మహిళల ఫ్యాషన్‌లోనూ కాలర్ ఓ భాగమై కూర్చుంది. డ్రెస్ డిజైనర్లు మెలితిరిగిన కాలర్లతో మ్యాజిక్ చేస్తున్నారు. జువెలరీలోనూ భాగం చేస్తున్నారు. ఊలుతోనో, పూసలతోనో హ్యాండ్‌మేడ్ కాలర్ నెక్లెస్ తయారు చేస్తున్నారు. రంగుల హంగులో అవి నవరత్న హారాలతో పోటీపడతాయి. ధర చౌక. ప్రతి సందర్భానికి ఓ హారం కొనుక్కోవచ్చు. మహా తేలిక. ఎంతసేపు ధరించినా చికాకుగా ఉండదు. జపనీస్ పూసలతోనూ అందుబాటులోకి వస్తున్నాయి. కొంత యాంటిక్ లుక్ కూడా తోడవుతున్నది.

# కాలర్ ఎగరేద్దాం



# అసలు తేయాకు ఎలా పుట్టింది?

తేనీరులో రకరకాల వెరైటీలు ఉన్నట్టే.. తేయాకు పుట్టుక వెనుక కూడా టీ పరిమళమంత గొప్ప కథలు పుట్టెడు ఉన్నాయి. బుద్ధుడి కనురెప్పల వెంట్రుకల నుంచి టీ మొక్క ఆవిర్భవించిందని కొందరి వాదన. వీటికి భిన్నంగా మరో కథ చైనా జానపదుల్లో వినిపిస్తుంది. 'దయ' దేవత కరుణతో తేయాకు మొక్కలు పుట్టాయని వాళ్లు బలంగా చెబుతారు. ఈ కథ చైనాలో బోధిసత్వుడి మూలాలను తెలియజేస్తుంది. ఈ గాథకు ఆయన్ను ప్రత్యక్షసాక్షిగా విశ్వసిస్తారు. చైనాలో ఒకానొక ప్రాంతంలో బోధిసత్వుడి కంచు విగ్రహం ప్రతిష్ఠించి ఉన్న పురాతన ఆలయం ఉండేదట. ఓ నిరుపేద రైతు రోజూ వచ్చి ఆ గుడిని శుభ్రం చేస్తుండేవాడు. అయితే ఒకరోజు ఆకస్మికంగా బోధిసత్వుడి విగ్రహం కదిలిందట. దాన్ని చూడగానే రైతు మోకరిల్లి కండ్లు మూసుకోగా.. దయా దేవి లోగొంతుకతో 'ఈ గుడి వెలుపల నీ భవిష్యత్తుకు తాళం చెవి ఉంది. దాన్ని జాగ్రత్తగా కాపాడుకో' అని చెప్పిందట. దిగ్భ్రాంతి నుంచి తేరుకున్న రైతు గుడి బయట వెతకగా ఓ ఎండిపోయిన పొద కనిపించిందట. దానికి పాదుతీసి, రోజూ నీళ్లు పోస్తూ జాగ్రత్తగా సంరక్షించాడు ఆ రైతు. కొన్నాళ్లకు ఆ పొద చివుళ్లు వేసింది. పచ్చగా కళకళలాడింది. ఆ ఆకులు సేకరించి పానీయంగా తాగితే ఎక్కడ లేని ఉత్సాహం వచ్చిందట. ఆ చెట్టు నుంచే చైనాలో తేయాకు మొక్కలు అంతటా విస్తరించాయని కొందరి నమ్మకం. అలా బోధిసత్వుడి ఆలయ ఆవరణలో తేయాకు ఉనికిలోకి వచ్చింది. ఆ దయ గల దేవత సెలవిచ్చినట్టు కొన్ని పరిస్థితుల్లో ఏమీ పాలుపోకుండా బుర్ర బద్దలవుతున్న వేళ.. చిక్కటి టీ తాగితే చాలు! తేనీటి తాళం చెవి ఆలోచనల గవాక్షం తెరిచి.. మస్తిష్కాన్ని తట్టిలేపుతుంది.

# త్రీడీ రింగ్స్







కళ్ల ముందు త్రీడీ ప్రపంచం కనిపించడం, వర్చువల్‌గా త్రీడీ లోకాన్ని చూడటం, వస్తువుల్ని త్రీడీ ప్రింటింగ్‌లో సృష్టించడమే కాదు॥ా% ఇప్పుడు ఉంగరాలూ త్రీడీ తరహాలో రూపుదిద్దుకుంటున్నాయి. అంగుళీకాల్లో అమరే ఏనుగులూ, చిలుకలూ, నెమళ్లను ఏకంగా త్రీడీ బొమ్మలా పైకి వచ్చేలా తీర్చిదిద్దుతున్నారు డిజైనర్లు.'త్రీడీ ఫింగర్ రింగ్స్' ఇప్పుడు ఉంగరానికి కొత్త సింగారం! రోజు వారీ ఆభరణాల్లో అగ్రస్థానం అంగుళీకానిదే. పెద్దగా నగలని ఇష్టపడని వాళ్లు కూడా ఉంగరాన్ని గారం చేస్తారు. నాజూగ్గానైనా సరే ఆ నగను అభిమానంగా ధరిస్తారు. ఇక, ఇప్పుడు స్టేట్‌మెంట్ రింగ్‌ల కాలం నడుస్తున్నది. ప్రత్యేకసందర్భాల కోసం, విభిన్నమైన దుస్తుల మీదకి ధరించే ఉంగరాలు పెద్ద సైజులో, రంగులూ, రాళ్లతో చూడగానే ఆకట్టుకునేలా కనిపిస్తాయి. పట్టు చీరల మీదికైనా, వన్‌పీస్‌ల పైకైనా స్టేట్‌మెంట్ రింగ్ డిఫరెంట్ లుక్ ఇస్తుంది. అందుకే ఇవి అన్ని వయసుల వాళ్లనూ కట్టిపడేస్తున్నాయి. వాటిలో విభిన్నంగా, ఇప్పుడు త్రీడీ ఫింగర్ రింగ్స్ అబ్బుర పరుస్తున్నాయి.

# డబ్బింగ్ షురూ.. ప్రభాస్ 'ది రాజా సాబ్'



పాన్ ఇండియా నటుడు ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం రాజా సాబ్ టాలీవుడ్ డైరెక్టర్ భలే భలే మొగాడివోయ్ ఫేమ్ మారుతి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది చివరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు సమాచారం. అయితే ఈ మూవీ నుంచి తాజాగా ఒక అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం, ప్రభాస్ వచ్చే వారం నుంచి తన పాత్రకు డబ్బింగ్ చెప్పడం ప్రారంభించనున్నట్లు తెలుస్తుంది. ప్రభాస్ అందుబాటులో ఉన్నంతసేపు అతడికోసం ప్రత్యేకంగా డబ్బింగ్ సెటప్‌ను కూడా ఏర్పాటు చేశారట. ప్రభాస్ మరికొన్ని రోజులు కేటాయిస్తే సినిమా షూటింగ్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తవుతాయని తెలుస్తోంది. అయితే షూటింగ్ ఆలస్యం అవ్వడం.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పెండింగ్ ఉండడంతో ఈ మూవీ విడుదల తేదీ ఎప్పుడు ప్రకటిస్తారా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. కాగా దీనిపై చిత్రబృందం క్లారిటీ ఇవ్వవలసి ఉంది. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. రిద్ధి కుమార్, సంజయ్ దత్ కీలక పాత్రల్లో మెరవనున్నారు.

## జీవితాన్నే మార్చిన క్షణాలవి!

చిత్రసీమలో పాత్రలతోనే గుర్తుండిపోయే తారలు చాలా అరుదు. అందులో ఒకరు కథానాయిక మృణాల్ ఠాకూర్. కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ సహజమైన నటనతో సినీప్రియుల్ని మెప్పించే ఈ భామ.. ఒక ఆడిషన్ తన జీవితాన్నే మార్చిందని అంటోంది. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న మృణాల్.. తన కెరీర్‌కు నాంది పలికిన క్షణాల్ని గుర్తు చేసుకుంది. "నటన పట్ల నాకు ఉత్సాహం ఉన్నా మొదట్లో దాన్ని ఆచరణలో పెట్టడానికి చాలా సమయం పట్టింది. నటనపై మక్కువ పెంచుకున్నప్పటికీ.. నా కలల్ని ఎలా స్వీకరిస్తారో తెలియక.. ఎప్పుడూ కుటుంబ సభ్యులతో పంచుకోలేదు. అనుకోకుండా ఓ రోజు నా స్నేహితురాలు ఒక మరాఠీ షో ఆడిషన్ గురించి చెప్పింది. అక్కడికి వెళ్లాను. అది నా మాతృభాష కాబట్టి.. నేను ఇరగదీసేశాను. అదే నాకు ఓ పాత్రను సంపాదించిపెట్టి.. నటనా ప్రయాణంలో మొదటి అడుగు వేసేలా చేసింది. కెరీర్‌లో ఎంతో మంది ప్రేక్షకుల ప్రేమను పొందడానికి కారణమైన ఆ క్షణాలు నా కెరీర్‌లో ఎప్పుడూ ప్రత్యేకమే" అని చెప్పుకొచ్చింది.



## పోరాడాలనే సంకల్పం.. ద్వేషం కంటే గొప్పది



"మా ప్రజలపై చేస్తున్న నిరంతర దాడులను ఇకపై సహించం.." అంటున్నారు బాలీవుడ్ నటుడు సంజయ్ దత్. భారత్ పాకిస్థాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల్లో పలువురు సినీ ప్రముఖులు భారత సాయుధ దళాలకు మద్దతు ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. "మా ప్రజలపై చేస్తున్న నిరంతర దాడులను ఇకపై సహించం.." అంటున్నారు బాలీవుడ్ నటుడు సంజయ్ దత్. భారత్ పాకిస్థాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల్లో పలువురు సినీ ప్రముఖులు భారత సాయుధ దళాలకు మద్దతు ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయంపై సంజయ్ దత్ స్పందిస్తూ ఎక్స్ వేదికగా ఓ నోట్‌ను పంచుకున్నారు. "ప్రజలపై చేస్తున్న నిరంతర దాడిని ఇకపై సహించం.. సందేహంతో కాదు పూర్తి శక్తి, సంకల్పంతో ప్రతిస్పందిస్తాం. ఈ యుద్ధం కేవలం ప్రజలకు, దేశానికి వ్యతిరేకం కాదు. ఇది ఉగ్రవాదుల ముసుగు వెనుక దాగున్న పిరికివాళ్లకు వ్యతిరేకం. వాళ్లు చాటు నుంచి దాడి చేస్తే మనం వాటికి తలవంచం అని కచ్చితంగా తెలుసుకుంటారు.

## సుందరం ప్రేమ ముచ్చట్లు "నీ కోసం ఓ రాజకుమారి



ఎదురుచూస్తుంది" అంటూ 'సుందరంగాడి ప్రేమకథ'ను పరిచయం చేసింది చిత్రబృందం. యువ నటీనటులు కార్తిక్ కొయ్య, లాస్య భావన ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో రామ్‌కి తెరకెక్కించారు."నీ కోసం ఓ రాజకుమారి ఎదురుచూస్తుంది" అంటూ 'సుందరంగాడి ప్రేమకథ'ను పరిచయం చేసింది చిత్రబృందం. యువ నటీనటులు కార్తిక్ కొయ్య, లాస్య భావన ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో రామ్‌కి తెరకెక్కించారు. దీన్ని కె.రాఘవేంద్రరావు నిర్మించారు. పెద్దలు పెట్టిన తన పేరు కారణంగా తనను ఎవరూ ప్రేమించట్లేదని 'సుందరం'గా పేరు మార్చుకుంటాడు కార్తిక్. ఆ తర్వాత తనని ఎవరైనా ప్రేమించారా? తను కలలు కంటున్న ఆ రాజకుమారి తన జీవితంలోకి వచ్చిందా? పేరు మార్చుకోవడం వల్ల సుందరం ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొన్నాడా? అనేది తెలియాలంటే 'సుందరంగాడి ప్రేమకథ' చూడాల్సిందే. ఇందులో శివన్నారాయణ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈటీవీ విన్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.

## మృణాల్ ఠాకూర్‌తో పెళ్లి వార్తలు.. స్పందించిన సుమంత్

నటుడు సుమంత్ నటి మృణాల్ ఠాకూర్ వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారంటూ ఇటీవల జోరుగా ప్రచారం జరిగింది. వీరిద్దరూ కలిసి దిగిన ఓ ఫొటో కూడా నెట్టింట వైరల్‌గా మారింది. వీటిపై తాజాగా సుమంత్ స్పష్టతనిచ్చారు. తన తదుపరి చిత్రం 'అనగనగా' ప్రమోషన్స్‌లో భాగంగా పెళ్లి వార్తలపై స్పందించారు. ఆయా వార్తల్లో నిజం లేదని పేర్కొన్నారు. సోషల్‌మీడియాను తాను పెద్దగా ఉపయోగించనని.. అందుకే ఈ వార్తలు తన దృష్టికి రాలేదని సుమంత్ తెలిపారు. నెట్టింట వైరల్‌గా మారిన ఫొటో తాము 'సీతారామం' ప్రమోషన్స్ సమయంలో తీసుకున్నామని వివరించారు. మరో ఇంటర్వ్యూలో ఆయన పెళ్లిపై మాట్లాడుతూ.. వైవాహిక బంధంలోకి మరోసారి అడుగుపెట్టే ఉద్దేశం లేదన్నారు.



సుమంత్‌కు గతంలోనే వివాహం జరిగిన విషయం తెలిసిందే. నటి కీర్తి రెడ్డిని పెళ్లి చేసుకున్నారు. కొంతకాలానికే వీరిద్దరూ విడిపోయారు. సుమంత్ హీరోగా నటించిన తాజా చిత్రమే 'అనగనగా'. 'ఈటీవీ విన్' ఒరిజినల్ మూవీగా ఇది విడుదల కానుంది. కాజల్ చౌదరి హీరోయిన్. సన్నీ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో సుమంత్ ఉపాధ్యాయుడిగా నటించారు. నేటి విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపడంతోపాటు చిన్నారులకు ఏ విధంగా పాఠాలు బోధిస్తే త్వరగా అర్థమవుతుందో చెప్పే ప్రయత్నం చేసినట్టు కొన్ని రోజుల క్రితం విడుదలైన టీజర్ చూస్తే అర్థమవుతోంది. మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి పెంచకూడదని.. కాన్సెప్ట్ నేర్చుకుంటే చాలు మార్కులు వాటంతటవే వస్తాయనేది ఆ ఉపాధ్యాయుడి నమ్మకం.



## బాలీవుడ్‌లో మరొకటి?

తెరపై సహజమైన నటనతో.. అదిరిపోయే స్టెప్పులతో కుర్రకారుని ఉర్రూతలూగించే కథానాయిక శ్రీలీల.. బాలీవుడ్‌లో కార్తిక్ ఆర్యన్‌తో కలిసి ఓ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడామె మరో హిందీ ప్రాజెక్టుకు ఓకే చెప్పినట్లు సమాచారం. విక్రాంత్ మాస్సే, లక్ష్య ప్రధాన పాత్రల్లో 'దోస్తానా 2' రూపొందుతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. కరణ్ జోహార్ నిర్మాత. ఇప్పుడీ చిత్రంలో కథానాయికగా శ్రీలీలను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దీని గురించి ఆమెతో చర్చలు చేస్తున్నారని.. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే త్వరలో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం శ్రీలీల జాబితాలో 'మాస్ జాతర', 'పరాశక్తి' తదితర చిత్రాలు ఉన్నాయి.

## ఈ సినిమా నచ్చకుంటే టికెట్ డబ్బులు వెనక్కి అడగొచ్చు: నవీన్ చంద్ర



"నేను చేసే కథలు, పాత్రలు బాగుంటాయని ప్రేక్షకులు మొదటి నుంచి ప్రశంసిస్తున్నారు. ఆ గౌరవానికి బదులుగా ఈ 'లెవెన్' చిత్రాన్ని అందించనున్నా. ఇప్పటి వరకు ఏ థ్రిల్లర్‌లోనూ చూడని ఓ వినూత్నమైన కాన్సెప్ట్ ఈ సినిమాలో ఉంది" అన్నారు హీరో నవీన్ చంద్ర. ఆయన.. రియా జంటగా నటించిన ఈ తెలుగు, తమిళ ద్విభాషా చిత్రాన్ని లోకేశ్ అజ్ల్స్ తెరకెక్కించారు. ఇది రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా ఈనెల 16న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లో ఇటీవల ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. హీరో సందీప్ కిషన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిత్ర బృందమంతా దేశం కోసం సరిహద్దుల్లో పోరాడుతున్న సైనికులకు సెల్యూట్ తెలిపింది. అనంతరం సందీప్ కిషన్ మాట్లాడుతూ.. "అదృష్టాన్ని కాకుండా కేవలం కష్టాన్ని మాత్రమే నమ్ముకున్న నటుడు నవీన్. ఈ చిత్రంతో తనకు మంచి విజయం దక్కాలని కోరుకుంటున్నా. ట్రైలర్ చూశా. ఆద్యంతం ఆసక్తిరేకెత్తించేలా ఉంది. ఇది కథను నమ్ముకొని చేసిన చిత్రమనిపించింది" అన్నారు."ఇది చాలా నిజాయతీతో తీసిన సినిమా. తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంది" అన్నారు దర్శకుడు లోకేశ్. హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ.. "ఇప్పటి వరకు ఈ సినిమా చూసిన వాళ్లంతా బాగుందని మెచ్చుకున్నారు. ఈనెల 15న పెయిడ్ ప్రీమియర్స్ వేయనున్నాం. అవి చూసి ప్రేక్షకులు థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు నేను అక్కడే నిల్చొని ఉంటా. ఒకవేళ మీకు సినిమా నచ్చకపోయి ఉంటే మీ టికెట్ డబ్బులు వెనక్కి అడిగే హక్కు మీకుంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.